
సాక్షి
నిజామాబాద్
ఆదివారం । 3 । సెప్టెంబర్ । 2023



అప్పుడలా.. ఇప్పుడిలా..

చెక్‌డ్యాంల నిర్మాణంతో పంటలు నీట మునిగి రైతులు నష్టపోతున్నారు. దీంతో అధికారులు చెక్‌డ్యాంల ఎత్తు తగ్గిస్తున్నారు.

- 8లో ▸



హౌసింగ్ బిల్లుల కోసం శ్రమించా

పేదల హౌసింగ్ బిల్లుల మంజూరు కోసం ఎంతో శ్రమించానని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.3 /26.7

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన

రుద్రూర్ : ఉత్తర బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడుతున్న ఆవర్తనం ప్రభావంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. ఈ విషయాన్ని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ వాతావరణ విభాగం శాస్త్రవేత్త బి.శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఆవర్తన ప్రభావంతో ఆదివారం నుంచి మూడు రోజులపాటు ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. రైతులు వర్షపు నీటిని లైనింగ్ ఉన్న నీటి కుంటలు, ఇంకుడు గుంతల్లోకి పంపించి, పొడి వాతావరణం ఏర్పడిన సమయంలో వ్యవసాయ పనులకు వినియోగించుకోవాలని సూచించారు. వర్షాలు ఆగేవరకు ఎలాంటి రసాయన మందులు పిచికారీ చేయవద్దని, పశువులను చెట్ల కింద కట్టి ఉంచరాదని, బయటికు తీసుకెళ్లకుండా పాకలలోనే ఉంచి మేతను అందించాలని సూచించారు.

వంద శాతం ఓటరు నమోదు చేయించాలి



సుభాష్‌నగర్ : అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా బూత్ లెవెల్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది చొరవ చూపాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. వారం రోజులపాటు ఇంటింటికి తిరుగుతూ, ఓటరు జాబితాలో పేర్లు లేని వారిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించాలన్నారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు, మార్పులు-చేర్పులకు వీలుగా పోలింగ్ బూత్‌ల పరిధిలో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్న నేపథ్యంలో కలెక్టర్ శనివారం జిల్లా కేంద్రంలోని పలు పోలింగ్ బూత్‌లను తనిఖీ చేశారు. నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్‌తో కలిసి ప్రభుత్వ బాలుర ఐటీఐలో గల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ప్రత్యేక శిబిరాల నిర్వహణ తీరు తెన్నులు పరిశీలించారు. ఇంటింటి సర్వే నిర్వహించే సమయంలో ఓటరు నమోదు, మార్పులు చేర్పులకు సంబంధించిన దరఖాస్తు ఫారాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో పేర్లు తొలగించే విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, మృతి చెందిన వారి మరణ ధ్రువీకరణ పత్రాన్ని కుటుంబ సభ్యుల నుంచి సేకరించాలని సూచించారు. ఎక్కడైనా పోలింగ్ కేంద్రాలు మారినట్లయితే ఓటర్లకు తెలియజేయాలని ఆదేశించారు.

అటవీ రక్షణకు చర్యలు చేపట్టాలి



మోపాల్ : మంచిప్ప ఫారెస్ట్ రేంజ్ పరిధిలో అటవీ రక్షణకు అవసరమైన అన్నిరకాల చర్యలను చేపట్టాలని జిల్లా అటవీశాఖ అధికారి (డీఎఫ్‌వో) వికాస్ మీనా ఆదేశించారు. శనివారం మండలంలోని కులాస్‌పూర్ అటవీ భూమిలో ఇటీవల చెట్లు నరికేసిన ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. రేంజ్ పరిధిలో తరచూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడంతో స్థానిక బీట్, సెక్షన్ అధికారులపై డీఎఫ్‌వో ఆగ్రహం వ్యక్తంచేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని, తమ పరిధిలోని ప్రాంతాన్ని క్రమం తప్పకుండా పరిశీలిస్తూ ఉండాలని ఆదేశించారు. మరోసారి ఇలా జరిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. చెట్లు నరికివేతపై విచారణ చేపట్టాలని, నిందితులను గుర్తించాలని సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. నరికేసిన చెట్ల స్థానంలో కొత్త మొక్కలు నాటాలని ఆదేశించారు. జిల్లాలో 20 మందితో అటవీ రక్షణకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని, రేంజ్ పరిధిలో ఏమైనా సమస్య ఉంటే బృందం దృష్టికి తీసుకెళ్తే వారు సహకరిస్తారని డీఎఫ్‌వో తెలిపారు. సౌత్ రేంజ్ అధికారి రామేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ ఎఫ్ఆర్‌వో సుధాకర్, సెక్షన్ అధికారి మానస తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌కు సైబర్ సెక్యూరిటీ బ్యూరో కేంద్రం

ఖలీల్‌వాడి : నిజామాబాద్‌కు సైబర్ సెక్యూరిటీ బ్యూరో కేంద్రం ఏర్పాటు చేస్తూ శనివారం డీజీపీ అంజనీకుమార్ యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో సాధారణ కేసుల కంటే ఎక్కువగా సైబర్ క్రైం కేసులు నమోదు అవుతున్నాయి. దీంతో సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు చేశారు.

పెళ్లి పిలుపు.. మేలుకొలుపు

పెళ్లంటే నూరేళ్ల పంట.. అందుకే వివాహ వేడుక ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటారు. పెళ్లి విషయంలో వధూవరులెన్నో కలలు కంటారు. నలుగురు మెచ్చేలా గొప్పగా తమ పిల్లల పెళ్లి చేయాలని తల్లిదండ్రులూ కోరుకుంటారు. కొందరు పెళ్లి పత్రిక దగ్గరే తమ ప్రత్యేకత చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. సామాజిక, ఆధ్యాత్మిక కోణాలలో ఆలోచించి పత్రికలు విభిన్నంగా ఉండేలా చూసుకుంటున్నారు. ఆహ్వాన పత్రికా ఉపయోగపడేలా విభిన్నంగా తయారు చేయిస్తున్నారు. ఓ తండ్రి తులసి విత్తనాలతో తన కూతురు పెళ్లి పత్రికను తయారు చేయించగా.. మరో తండ్రి భగవద్గీతలో శుభలేఖను ముద్రించి పంచారు. మరొకరు సందేశాత్మకంగా రూపొందించి పంపిణీ చేశారు. ఇలా కొందరు పెళ్లి పత్రికతోనూ సమాజానికి మేలు చేస్తున్నారు. కొత్త తరహా శుభలేఖలపై సండే స్పెషల్

ఆహ్వానం.. ప్రయోజనకరం

- వెరైటీగా వెడ్డింగ్ కార్డ్స్ తయారీ
- తులసి విత్తనాలతో పత్రికల ముద్రణ
- భగవద్గీతలో లగ్నపత్రికలు
- ఆధ్యాత్మిక, సామాజిక అంశాలతోనూ శుభలేఖలు

■ నిజామాబాద్ నగరానికి చెందిన మంచాల జ్ఞానేందర్ గుప్తా అనే వ్యాపారవేత్త సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తుంటారు. తన కూతురు శరణ్య వివాహం కోసం విభిన్నంగా ఆలోచించారు. అహ్మదాబాద్‌కు వెళ్లి తులసి విత్తనాలతో పత్రికలను తయారు చేయించారు. ఈ పెళ్లి పత్రికను పూలమొక్కల కుండిలో వేసి నీళ్లు పోస్తే నాలుగు రోజుల్లో కరిగిపోయి విత్తనాలు వస్తాయని చెప్పడంతో బంధువులు, స్నేహితులందరూ అలాగే చేశారు. చెత్తబుట్టలో చేరాల్సిన పత్రిక.. తులసి మొక్కగా మారిందని జ్ఞానేందర్ గుప్తా మురిసిపోతున్నారు.

■ ప్రస్తుతం నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ గా పనిచేస్తున్న మంద మకరందు వివాహం గతేడాది ఫిబ్రవరి 11న జరిగింది. ఆయన సైతం ప్రకృతి హితంగా ఉండేలా తన లగ్న పత్రికను సీడ్ పేపర్‌పై రూపొందించారు. తిరిగి వినియోగించడానికి యోగ్యమైన పోచంపల్లి ఇక్కత్‌తో తయారు చేసిన మాస్క్‌లను పెళ్లిపత్రికతోపాటు అందించారు. ఆ పత్రికను స్వదస్తూరితో రూపొందించడం గమనార్హం.




సండే స్పెషల్

సాక్షి, కామారెడ్డి: సమాజంలో మార్పు వస్తోంది. అన్నింటిలోనూ కొత్తదనాన్ని కోరుకుంటున్నారు. పెళ్లి పత్రికల విషయంలోనూ ఇదే ఆలోచన చేస్తున్నారు. అందరికన్నా భిన్నంగా ఉండాలన్న తపనతో సృజనాత్మకంగా శుభలేఖలు తయారు చేయిస్తున్నారు. ఇందులోనూ పలువురు సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తున్నారు. ఆహ్వాన పత్రికలూ వృథా కాకుండా ఉండేలా పర్యావరణహిత శుభలేఖలను పంచుతూ పెళ్లి పిలుపులతోనూ సమాజాన్ని మేలుకొలుపుతున్నారు.

కామారెడ్డికి చెందిన బంగారం వ్యాపారి యెనిశెట్టి శ్రీనివాస్ కుమారుడు శివతేజ వివాహం ఈనెల 9న జరగనుంది. తన కుమా... రుడి శుభలేఖ ... ప్రతి ఇంట్లో పది కాలాల పాటు ఉండేందు కు ఏం చేయాలని తన బంధుమిత్రులతో చర్చించారు. హైదరాబాద్‌లో నివసించే బంధువులకు స్టేషనరీ షాప్ ఉంది. వారి సూచనతో భగవద్గీత, గీతా మాధుర్యం, విష్ణు సహస్ర నామ సహిత భగవద్గీత గ్రంథాలలో లగ్న పత్రికను ముద్రించి బంధుమిత్రులకు పంచారు.

అలాగే కామారెడ్డికి చెందిన నాగెల్లి శ్రీనివాస్ తన కూతురు వివాహం సందర్భంగా సామాజిక బాధ్యతను గుర్తు చేస్తూ ఆహ్వాన పత్రికపై స్లోగన్స్ ముద్రించారు. ఇలా విభిన్నంగా ఆలోచిస్తూ లగ్న పత్రిక గుర్తుండిపోయేలా చూసుకుంటున్నారు.



శ్రీమద్భగవద్గీతతో యెనిశెట్టి శ్రీనివాస్ రూపొందించిన పెళ్లి పత్రిక



తులసి విత్తనాలతో జ్ఞానేందర్ రూపొందించిన పత్రిక





నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మకరందు శుభలేఖ, ఆర్టీసీ ఎండీకి అందిస్తున్న మకరందు(ఫైల్)

పది కాలాలు గుర్తుండేలా...



నా కుమారుడి పెళ్లి ఈనెల 9న జరగనుంది. పెళ్లి పత్రిక అందరికీ ఉపయోగపడేలా ఉండాలని ఆలోచించాను. బంధువులతో మాట్లాడితే భగవద్గీతకు సంబంధించిన వివిధ పుస్తకాలలో ముద్రించి ఇస్తే బాగుంటుందని సలహా ఇచ్చారు. ఆ ఆలోచన నచ్చింది. వీటిని చూసినవారు అందరూ అభినందిస్తున్నారు. పుస్తకం ఉన్నన్ని రోజులు మా కుమారుడి పెళ్లి గుర్తుంటుంది. **– యెనిశెట్టి శ్రీనివాస్,** కామారెడ్డి

ప్రకృతిహితంగా ఉండాలని..



నా కూతురు శరణ్య వివాహం ఫిబ్రవరి 24న జరిగింది. పెళ్లి పత్రికతో పర్యావరణానికి హాని కలగకుండా ఏం చేయాలా అని ఆలోచించాను. తులసి విత్తనాలతో పత్రిక తయారు చేయించాలని నిర్ణయించుకున్నా. మూడు వేల పత్రికలను బంధువులు, స్నేహితులకు పంపిణీ చేశాం. వాటిని కుండీలలో ఉంచి తులసి మొక్కలు పెంచారు. ఆనందం అనిపించింది. **– మంచాల జ్ఞానేందర్,** నిజామాబాద్

చాలా రకాలుగా ప్రింట్ చేయిస్తున్నారు



మా దగ్గరికి పత్రికల ముద్రణ కోసం వచ్చే వాళ్లు రకరకాలుగా చెబుతుంటారు. కొందరు పత్రికలో సామాజిక చైతన్యం కలిగించే అంశాలు ముద్రిస్తుంటారు. మరికొందరు ఆధ్యాత్మిక విషయాలు ఉండాలంటారు. ఇంకొందరు వెరైటీగా ఉండాలంటారు. అందరిలోనూ ఆలోచన ధోరణి మారింది. పత్రిక కూడా ఏదో ఒకదానికి ఉపయోగపడాలని అనుకుంటున్నారు. **– శ్రీధర్,** కల్కి స్క్రీన్ ప్రింటర్స్, కామారెడ్డి

జన నేతకు ఘన నివాళి



వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖలీల్‌వాడి : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా జిల్లావ్యాప్తంగా అభిమానులు నివాళులు అర్పించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మానాల మాట్లాడుతూ.. అభివృద్ధి ఫలాలు ప్రతి పేదవాడికి అందించాలని పరితపించిన నాయకుడు వైఎస్సాఆర్ అని కొనియాడారు. పేదల సంక్షేమం కోసం ఆయన ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు. వైఎస్సార్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితోపాటు మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశారన్నారు. పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్ మాట్లాడుతూ.. 1985 తనకు ఎమ్మెల్యే టికెట్ రావడంలో వైఎస్సార్ పాత్ర మరువ లేననిదని గుర్తు చేసుకున్నారు. భూపతిరెడ్డి, ముప్ప గంగారెడ్డి, అంతారెడ్డి రాజారెడ్డి, మీసాల సుధాకర్ రావు, వేణురాజ్, నీరడ్డి భాగ్య, లింగం, సంతోష్, కేశ మహేష్, ఈసా, రమేశ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

- నూతన సీపీ సత్యనారాయణ
- బాధ్యతల స్వీకరణ

ఖలీల్‌వాడి: జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని సీపీ సత్యనారాయణ అన్నారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీపీ విలేకరులతో మాట్లాడారు. మహిళలకు భద్రత కల్పిస్తామని, చిన్నారులపై లైంగిక దాడులకు పా ల్పడిన వారిపై పోక్సో కేసులు నమోదు చేస్తామన్నా రు. ప్రస్తుతం సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. సైబర్ నేరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీపీ కార్యాలయానికి చేరుకోగానే పోలీసులు గౌరవవందనం చేశారు. సీపీ గురువారం వరకు సెలవులో వెళ్తున్నట్లు తెలిసింది. ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, ఎస్బీ సీఐ శ్రీశైలం, సీఐలు నరహరి, వెంకటనారాయణ, ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు ఉన్నారు.

సీపీ సత్యనారాయణ ప్రొఫైల్



పేరు : సత్యనారాయణ
సర్వీస్ : ఇండియన్ పోలీస్ సర్వీస్(2006 బ్యాచ్)
విద్యార్హతలు : ఎంఎస్సీ (అగ్రికల్చర్)(ఎల్‌ఎల్‌ఎం)
అపాయింట్‌మెంట్ : డీఎస్పీగా 22-04-1999
కన్ఫర్డ్ ఐపీఎస్‌గా పదోన్నతి : 19-12-2011

(2006 బ్యాచ్ ఐపీఎస్)

గతంలో పని చేసిన ప్రాంతాలు : కర్నూలు డీఎస్పీ, మల్కాజిగిరి, సైబరాబాద్ ఏసీపీ, డీఎస్పీ రంపచోడవరం(తూర్పు గోదావరి), తూర్పు గోదావరి అడిషనల్ ఎస్పీ, ఛీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్, సీఎం ఏపీ ఇంటిలిజెన్స్ డిపార్ట్‌మెంట్, వెస్ట్‌జోన్, సౌత్‌జోన్ డీసీపీగా పనిచేశారు. రామగుండం సీపీగా, రాచకొండ జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. ఆయన రాచకొండ నుంచి జిల్లాకు వచ్చారు.



సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న సీపీ సత్యనారాయణ

తుది జాబితాలో తప్పులు ఉండొద్దు

- వీసీలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అధికారులు

సుభాష్‌నగర్ : తుది ఓటరు జాబితాలో ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా పరిశీలించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ సూచించారు. డబుల్ ఎంట్రీ, బోగస్ పేర్లు లేకుండా జాబితాను బీఎల్‌వో మొదలుకుని ఈఆర్‌వో స్థాయి వరకు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు సైతం జాబితా నుంచి గల్లంతు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సన్నద్ధతలో భాగంగా శనివారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సీఈవో సమీక్షించారు. మార్పులు–చేర్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిశీలిస్తూ, రోజువారీగా పరిష్కరించాలని, వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయించాలని ఆదేశించారు. ప్రత్యేక శిబిరాల్లో వచ్చిన దరఖాస్తులు, వాటి పరిశీలన ప్రక్రియ ఏ దశలో ఉందన్న వివరాలను ఆరా తీశారు. ఈ విషయమై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు స్పందిస్తూ జిల్లాలో మొదటి రెండు రోజులు నిర్వహించిన స్పెషల్ క్యాంపెయిన్ సందర్భంగా 5,600 దరఖాస్తులు క్షేత్రస్థాయిలో దాఖలు అయ్యాయని సీఈవో దృష్టికి తెచ్చారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారితో వీసీ ముగిసిన తర్వాత కలెక్టర్ ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఓటరు జాబితా పక్కాగా రూపొందేలా అన్నిస్థాయిలలో పకడ్బందీ పరిశీలించాలని ఆదేశించారు. 18–19 ఏళ్లు ఉన్న ఏ ఒక్కరు కూడా తప్పిపోకుండా ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఈమేరకు కళాశాలల నిర్వాహకులు, విద్యార్థులతో అవగాహన సమావేశాలు నిర్వహించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు యాదిరెడ్డి, చిత్రామిశ్రా, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, డీసీవో సింహాచలం, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, వినోద్ కుమార్, భుజంగరావు పాల్గొన్నారు.

నీటి నమూనాల సేకరణ



సాక్షి ఎఫెక్ట్..

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో నీరు రంగు మారడంతో అధికారులు నీటి నమూనాలు సేకరించారు. ఎగువ నుంచి వ్యర్థాలు వదలడంతో ప్రాజెక్టు నీరు కలుషితం అవు తోందని సాక్షి పత్రికలో వచ్చిన కథనానికి ప్రాజెక్ట్ అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి శనివారం నీటి నమూనాలను సేకరించారు. మిషన్ భగీరథ గ్రిడ్ ల్యాబ్‌లో పరీక్షలు చేపట్టి నివేదిక అందజేస్తామన్నారు. ప్రాజెక్ట్ ఈఈ చక్రపాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పంటలకు నష్టం లేదు

శ్రీరాంసాగర్ నుంచి విడుదల అవుతున్న నీటితో పంటలకు ఎలాంటి నష్టం ఉండదని ఎస్ఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎగువ నుంచి వస్తున్న వ్యర్థాలతో నీరు రంగు మారిందన్నారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటికి సరఫరా జరుగుతుందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ రిపోర్టులో ఎలాంటి కలుషితం లేదని వచ్చిందన్నారు.

మత్స్య శాఖలో స్తంభించిన పాలన

- విధులు బహిష్కరించిన కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు
- రెగ్యులర్ చేయాలని డిమాండ్

డొంకేశ్వర్(ఆర్మూర్) : జిల్లా మత్స్య శాఖలో పరిపాలన స్తంభించింది. తమను రెగ్యులర్ చేయాలని శాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు విధులు బహిష్కరించారు. కొన్ని రోజులుగా అన్ని జిల్లాల ఉద్యోగులతో కలిసి రాష్ట్ర స్థాయిలో సమ్మె చేపడుతున్నారు. దీంతో శాఖపరమైన పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ప్రధానంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమంపై ప్రభావం పడింది. జిల్లాలో ప్రారంభానికి నోచుకోక ఆలస్యమవుతోంది. మత్స్య శాఖ కార్యాలయంలో రెగ్యులర్ ఉద్యోగులు అటెండర్‌తో కలిపి నలుగురే ఉండడంతో వీరిపై పనిభారం పెరిగింది. జిల్లా నుంచి ముగ్గురు చొప్పున ఫిషర్‌మెన్‌లు, ఫిషరీష్ అసిస్టెంట్లు, ఒకరు ఫిషరీష్ ఫీల్డ్ ఆఫీసర్ కలిపి మొత్తం ఏడుగురు ఉద్యోగులు కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్నారు. అలాగే ఒకరు అవుట్ సోర్సింగ్ పద్ధతిన కంప్యూటర్ ఆపరేటర్‌గా కొనసాగుతున్నారు. వీరు గత కొన్నేళ్లుగా మత్స్య శాఖలో పని చేస్తున్నారు. అందరి ఉద్యోగుల మాదిరిగానే తమను కూడా రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. సమ్మెలో ఉన్న పలు జిల్లాల మత్స్య శాఖ ఉద్యోగులకు విధుల్లో చేరాలని నోటీసులు ఇచ్చారు. జిల్లా ఉద్యోగులకు కూడా ఇచ్చే ప్రయత్నం చేయగా, అధికారులు ఆలోచనను విరమించుకున్నట్లు తెలిసింది. కొన్ని రోజులుగా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు విధులకు దూరంగా ఉండడంతో శాఖ పాలన గాడి తప్పింది. క్షేత్రస్థాయి పరిశీలన, చేప పిల్లల పంపిణీ కార్యక్రమాలను చూసుకునే వారు కరువయ్యారు. అయితే మత్స్య శాఖ ఉద్యోగుల సమ్మెపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.

ఇన్‌చార్జి ఏడీగా నర్సింహారావు

చేప పిల్లల పంపిణీ సమయంలోనే శాఖలోని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు విధులను బహిష్కరించడంతో మత్స్య శాఖ ఏడీ రాజనర్సయ్యకు ఏం చెయ్యాలో పాలుపోలేదు. పనిభారం, ఒత్తిడి పెరగడంతో ఆయన అనారోగ్యానికి గురయ్యారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో నిర్మల్ జిల్లాకు చెందిన ఏడీ నర్సింహారావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర శాఖ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. రాజనర్సయ్య వచ్చే వరకు ఈయనే ఏడీగా కొనసాగనున్నారు.

క్లుప్తంగా

నేర విచారణకు సాక్ష్యాధారాలే కీలకం



ఖలీల్‌వాడి: నేర విచారణలో సాక్ష్యాలే కీలక ఆధారాలు అని డిప్యూటీ డైరెక్టర్‌ ఆఫ్‌ ప్రాసిక్యూషన్‌ లక్ష్మీనర్సయ్య అన్నారు. జిల్లాలోని వివిధ కోర్టుల్లో ప్రాసిక్యూటర్స్‌గా విధులు నిర్వహిస్తున్న వారితో శనివారం సమావేశం నిర్వహించారు. అసిస్టెంట్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్స్‌ మహమ్మద్‌ రహీముద్దీన్‌, రాజేశ్‌గౌడ్‌ మాట్లాడుతూ.. ఫారెస్టు చట్టం, కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టడంలో ఉన్న విశిష్టతలను వివరించారు. ఫారెస్ట్‌, రిజర్వ్‌ ఫారెస్ట్‌ అనే విషయాలు, ఫారెస్ట్‌కు సంబంధించిన చిత్రపటాలు, నక్షలను సేకరించి సమగ్ర ఫైనల్‌ రిపోర్ట్‌ను కోర్టుకు సమర్పించాలని తెలిపారు. చట్టాలు, కోర్టుల తీర్పులపై అధ్యయనం చేయాలని సూచించారు.

ఓటరు నమోదు పక్కాగా చేపట్టాలి



బాల్కొండ: ఓటరు నమోదు పక్కాగా ఉండాలని, 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్‌ చిత్రా మిశ్రా అన్నారు. బాల్కొండ, ముప్కాల్‌ మండల కేంద్రాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓటింగ్‌ నమోదు కేంద్రాలను శనివారం పరిశీలించారు. ఓటు హక్కు పొందేందుకు నిర్వహిస్తున్న స్పెషల్‌ డ్రైవ్‌ను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శని, ఆదివారాల్లో ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఆమె వెంట తహసీల్దార్లు శ్రీధర్‌, వనజారాణి, డిప్యూటీ తహసీల్దార్‌ శ్రీకాంత్‌, సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బోధన్‌: పట్టణంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్‌ జూనియర్‌ కళాశాలలో గెస్ట్‌ ఫ్యాకల్టీ ప్రాతిపదికన ఫిజిక్స్‌ బోధించేందుకు మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌ కె.పద్మజ శనివారం తెలిపారు. పీజీలో 55 శాతం, బీఈడీ ఉన్న అభ్యర్థులు అర్హులని, ఈ నెల 5లోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 9346138537 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బొల్లక్‌పల్లి సర్పంచ్‌ భర్త మృతి



పిట్లం(జుక్కల్‌): మండలంలోని బొల్లక్‌పల్లి సర్పంచ్‌ సావిత్రి భర్త రవీందర్‌ (52) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. శనివారం నిర్వహించిన అంత్యక్రియల్లో ఎమ్మెల్యే హన్మంత్‌ షిండే పాల్గొని పాడె మోశారు. అంత్యక్రియల్లో బీఆర్‌ఎస్‌ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శెట్పల్లిలో అన్నాదమ్ముళ్ల ఘర్షణ

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లి గ్రామానికి చెందిన నీల సత్యనారాయణ, బాలరాజు అనే అన్నాదమ్ముళ్లు తల్లిదండ్రుల సంరక్షణ విషయంలో శనివారం ఘర్షణ పడినట్లు ఎస్సై ప్రభాకర్‌ తెలిపారు. వారసత్వంగా వచ్చిన ఆస్తులను సమానంగా పంచుకున్న వీరు తల్లిదండ్రులను ఒక్కొక్కరు ఆరు నెలలు పోషించాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో అన్న బాలరాజు ఒప్పందాన్ని ఉల్లంగించారని ఇరువురు ఘర్షణ పడ్డారు. పాత కక్షలు మనసులో పెట్టుకొని ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అప్పుడలా.. ఇప్పుడిలా..

- నిధుల కోసం చెక్‌డ్యాం ఎత్తు పెంచిన అధికారులు
- ముంపునకు గురైన పంటలు
- రైతుల ఆందోళనతో ఎత్తు కుదిస్తున్న నీటి పారుదల శాఖ



నీట మునిగి ఇసుక మేటలు వేసిన పంట పొలాలు



తొర్తి, వెంచిర్యాల్‌ల మధ్య నిర్మించిన చెక్‌డ్యాం ఎత్తును తగ్గించడానికి కూలుస్తున్న పొక్లెయిన్‌

మోర్తాడ్‌(బాల్కొండ): చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా మారింది నీటి పారుదల శాఖల అధికారుల పరిస్థితి. పెద్దవాగు, కప్పలవాగులో నిర్మించిన చెక్‌డ్యాంల ద్వారా రైతులకు ప్రయోజనం కల్పించే ఉద్దేశం ఎలా ఉన్నా నిధులను భారీగా మంజూరి చేయించడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు అవసరం లేకున్నా కట్టల ఎత్తు పెంచారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెక్‌డ్యాంల ఎత్తు పెంచడంతో పంటలు నీట మునుగుతాయని నిర్మా పనులు ఆరంభించిన సమయంలోనే రైతులు గగ్గోలు పెట్టారు. అప్పట్లో ఇవేమి పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పుడు స్పందించి కట్ట ఎత్తును తొలగించడానికి చర్యలు చేపట్టడం చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంలా మారింది. తాజాగా ఏర్గట్ల మండలం తొర్తి, వెంచిర్యాల్‌ మధ్య నిర్మించిన చెక్‌డ్యాం ఎత్తును తగ్గించడానికి పొక్లెయిన్‌తో తవ్వకాలు కొనసాగిస్తున్నారు. ఇక్కడ చెక్‌డ్యాం ఎత్తును 2.5 మీటర్లకే పరిమితం చేయాల్సి ఉన్నా 4 మీటర్ల ఎత్తులో నిర్మించారు. చెక్‌డ్యాం ఎత్తు పెంచడంతో పరిసరాల్లోని పంట పొలాలు నీట మునిగి తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ముందుగానే గుర్తించారు. అయినా అప్పట్లో ప్రజాప్రతినిధులు లెక్క చేయకుండా రూ.4.80 కోట్లు మంజూరికి ప్రాధాన్యం ఇచ్చారు. ఎత్తును తగ్గిస్తే నిధులు మిగిలిపోతాయనే ఉద్దేశంతో తమ లాభాల కోసం పనులు కానిచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. వేల్పూర్‌ మండలం పచ్చలనడ్కుడ, జాన్కంపేట్‌ల మధ్య నిర్మించిన చెక్‌డ్యాం ఎత్తు 3 మీటర్లుగా ప్రతిపాదించి నిధులను పెంచుకోవడానికి 4.1 మీటర్ల ఎత్తుకు పెంచారు. ఈ చెక్‌డ్యాం కోసం రూ.4.78 కోట్లు మంజూరి చేయించారు. భీమ్‌గల్‌ మండలం బెజ్జోరా వద్ద నిర్మించిన చెక్‌డ్యాం పరిస్థితి కూడా అలాగే ఉంది. జూలైలో కురిసిన భారీ వర్షాలతో చెక్‌డ్యాం నిండి పంటలు నీట మునిగిపోయాయి. రెండు వాగుల్లో రూ.48 కోట్లకు మేర నిధులను కేటాయించి 12 చోట్ల చెక్‌డ్యాంలను నిర్మించారు. నిజామాబాద్‌ రూరల్‌, బాల్కొండ నియోజకవర్గాల్లో 42 కిలోమీటర్ల పొడవున ఉన్న వాగులో ఈ చెక్‌డ్యాంల నిర్మాణం పూర్తి చేశారు. చెక్‌డ్యాంల నిర్మాణంలో ప్రమాణాలు పాటించకపోవడంతో ఈ సీజన్‌లో దాదాపు 2,500ల ఎకరాల పంట పొలాలు నీట మునిగాయి. ఇసుక మేటలు వేయడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

వీడీసీలను బతిమాలుతున్న అధికారులు..

నిర్ణీత ఎత్తు కంటే ఎక్కువ ఎత్తులో చెక్‌డ్యాంలను నిర్మించిన చోట పంటలు నీట మునుగడంతో రైతుల నుంచి నిరసన వ్యక్తమైతుంది. ఈ నేపథ్యంలో చెక్‌డ్యాంల ఎత్తును తగ్గించాలని నిర్ణయించారు. సాంకేతికంగా ఆమోదం లభించడం కష్టం కావడంతో గ్రామాభివృద్ధి కమిటీల ద్వారా అధికారులు లేఖలను కోరుతున్నారు. వీడీసీలు తమకు సహకరించి చెక్‌డ్యాంల ఎత్తు తగ్గించాలని లేఖలు ఇవ్వాలని విన్నవిస్తుండడ కొసమెరుపు.

సుమోటో అనుమతులతోనే..

చెక్‌డ్యాంలను నిర్మించడానికి హైడ్రాలిక్‌ క్లియరెన్స్‌ పొందాల్సి ఉంది. నిబంధనల ప్రకారం చెక్‌డ్యాంలను నిర్మిస్తే తమకు లాభాలు తక్కువగా ఉంటాయనే ఉద్దేశంతో సుమోటో అనుమతులతోనే చెక్‌డ్యాంలను నిర్మించడం రైతుల పాలిట శాపంగా మారింది. హైడ్రాలిక్‌ అనుమతులతో చెక్‌డ్యాంలను నిర్మించాలంటే ఎక్కడ ఎంత ఎత్తులో చెక్‌డ్యాం కట్టను నిర్మించాలి, ఎంత మేరకు నీటిని నిలువ ఉంచాలి, పరిసరాల్లోని పంటలకు నష్టం ఏమైనా వాటిల్లుతుందా లేదా అనే అంశాల్లో ఇంజినీర్లు సర్వే నిర్వహించి నివేదికను అందిస్తారు. ఇంజినీర్‌ ఇన్‌ చీఫ్‌ హైడ్రాలిక్‌ క్లియరెన్స్‌ ఇచ్చిన తరువాతే చెక్‌డ్యాంల నిర్మాణం కొనసాగుతుంది. ఇవేమి పరిగణలోకి తీసుకోకుండా సుమోటో అనుమతులతో పనులు కానివ్వడం పెద్ద నష్టాలకు దారి తీసిందనే అభిప్రాయం వ్యక్తమైతుంది.

అవినీతిపై విచారణ చేపట్టాలి



జిల్లాలో వాగులపై నిర్మించిన చెక్‌డ్యాంలలో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలి. అవసరం లేకపోయినా ఎత్తును పెంచడం, నిధులను అడ్డగోలుగా ఖర్చు చేయడం చూస్తుంటే రైతుల ప్రయోజనాల కంటే నేతల లాభమే ముఖ్యంగా కనిపిస్తోంది.

–సుంకెట్‌ అన్వేష్‌రెడ్డి, కిసాన్‌ కాంగ్రెస్‌ రాష్ట్ర అధ్యక్షుడు

నష్టపరిహారం అందించాలి



చెక్‌డ్యాంలు తెగిపోవడం, పంటలు నీట మునిగి భూమి అంతా ఇసుక మేటలు వేయడంతో తాము భారీగానే నష్టపోయాం. రైతులకు నష్ట పరిహారాన్ని ప్రభుత్వం మంజూరు చేయాలి. రెండుమార్లు చెక్‌డ్యాంలతో నష్టం కలిగింది. ఇప్పటి వరకు పరిహారం చెల్లించలేదు.

–నరేశ్‌యాదవ్‌, రైతు, సుంకెట్‌

మునిపల్లిలో గ్రామస్తుల ధర్నా



జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న గ్రామస్తులు

జక్రాన్‌పల్లి: మండలంలోని మునిపల్లి జాతీయ రహదారిపై మునిపల్లి గ్రామస్తులు శనివారం ధర్నా నిర్వహించారు. మునిపల్లికి చెందిన అసైన్డ్‌ భూమిని అంకాపూర్‌కు చెందిన కొందరు వ్యక్తులు అక్రమంగా ధరణిలో తమ పేర్లు ఎక్కించుకున్నారని ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. ధరణిలో అక్రమంగా పేర్లు నమోదు చేసిన అధికారులను సస్పెండ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. కలెక్టర్‌ వచ్చే వరకు రాస్తారోకోను విరమించేది లేదన్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్‌ కలీం గ్రామస్తులతో చర్చించారు. అయినా గ్రామస్తులు వినిపించుకోలేదు. ఆర్మూర్‌ సీఐ సురేశ్‌బాబు గ్రామస్తులతో చర్చలు జరిపారు. ఆర్డీవోతో పాటు కలెక్టర్‌ గ్రామస్తులతో మాట్లాడడానికి సిద్ధంగా ఉన్నారని గ్రామ పెద్దలు పది మంది కలెక్టర్‌ కార్యాలయానికి వెళ్లాలని సూచించారు. దీంతో గ్రామస్తు లు రాస్తారోకోను విరమించారు. జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి, ఆర్మూర్‌, జక్రాన్‌పల్లి పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టారు.

కొనసాగుతున్న గాలింపు చర్యలు



చెంచయ్య (ఫైల్‌)

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): కులాస్‌పూర్‌లోని నల్లకుంట చెరువులో శుక్రవారం సాయంత్రం గల్లంతైన చెంచయ్య మృతదేహం కోసం గజ ఈతగాళ్లతో శనివారం గాలింపు చర్యలు చేపట్టారు. చెంచయ్యకు భార్య వెంకటరమణమ్మ, ఏడాదిన్నర పాప ఉన్నారు.

ఆర్మూర్‌ హెడ్‌ పోస్టాఫీస్‌ తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న ప్రకాశ్‌

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ పట్టణంలోని హెడ్‌ పోస్టాఫీస్‌ను తెలంగాణ పోస్ట్‌ మాస్టర్‌ జనరల్‌ కె. ప్రకాశ్‌ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డెలివరీ ఫర్ఫార్మెన్స్‌, నగదు బదిలీ, కొత్త పథకాలు, ఇన్సూరెన్స్‌, పోస్టాఫీసులోని వివిధ పథకాల అమలు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. నూతన ఖాతాల ఓపెనింగ్‌లో తెలంగాణ సర్కిల్‌ను ప్రథమ స్థానంలో నిలిపిన భీంగల్‌ మండలంలోని పిప్రి బ్రాంచ్‌ పోస్ట్‌ మాస్టర్‌ అప్సర్‌ను సన్మానించి అభినందించారు. ఆయన వెంట జిల్లా సీనియర్‌ సూపరింటెండెంట్‌ ఎస్‌.అనిల్‌ కుమార్‌, ఆర్మూర్‌ అసిస్టెంట్‌ సూపరింటెండెంట్‌ సురేఖ, ఆర్మూర్‌ హెడ్‌ పోస్ట్‌మాస్టర్‌ అజయ్‌ కుమార్‌, జిరాయత్‌నగర్‌ సబ్‌ పోస్టాఫీస్‌ ఎస్పీఎం ఆంజనేయులు, ఎంవోలు దశరథ్‌, చంద్రశేఖర్‌, బీపీఎంలు, ఏబీపీఎంలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



భిక్కనూరు: జంగంపల్లి శివారులో జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామశివారులోని రైస్‌ మిల్లు నుంచి బియ్యం లోడ్‌తో కామారెడ్డి వైపు వెళ్తున్న లారీని హైదరాబాద్‌ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న మరో లారీ వెనుక నుంచి ఢీకొన్నది. ఈ ఘటనలో వెనుక నుంచి ఢీకొన్న లారీ డ్రైవర్‌, క్లీనర్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు క్షతగాత్రులను కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

క్రైం కార్నర్‌

ఉద్యోగం రావడం లేదని ఆత్మహత్య



గజ్జెల రాకేష్‌ (ఫైల్‌)

రాజంపేట: ఆర్మీలో చేరాలన్న కల నెరవేరడం లేదని, ఉద్యోగం రావడం లేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా రాజంపేట మండల కేంద్రానికి చెందిన గజ్జెల రాకేష్‌(24) ఐటీఐ పూర్తి చేశాడు. సైన్యం చేరాలన్నది అతడి కల. రెండుసార్లు ఆర్మీ సెలక్షన్స్‌కు హాజరైనా.. కంటి చూపు సమస్యతో ఉద్యోగానికి ఎంపిక కాలేకపోయాడు. ఉద్యోగావకాశాలు రాకపోవడంతో మానసికంగా కుంగిపోయిన రాకేష్‌.. శనివారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో పొలానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి,తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా.. చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. మృతుడి తండ్రి గజ్జెల లింగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఏఎస్సై గంగారెడ్డి తెలిపారు.

వివాహిత అదృశ్యం

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): మండలంలోని బాడ్సి గ్రామానికి చెందిన పిల్లిగంప సంధ్య అదృశ్యమైనట్లు ఎస్సై ఎల్‌ రాము తెలిపారు. సంధ్యకు అదే గ్రామానికి చెందిన వ్యక్తితో రెండు నెలల క్రితం వివాహమైంది. ఆగస్టు 4న తల్లిగారింటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన సంధ్య తిరిగి రాలేదు. అప్పటి నుంచి బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. సంధ్య తల్లి లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



రాజేందర్‌ (ఫైల్‌)

సిరికొండ: రోడ్డు ప్రమాదంలో గాయపడి నిమ్స్‌లో చికిత్స పొందుతున్న రావుట్ల గ్రామానికి చెందిన నడుకుడ రాజేందర్‌(45) శనివారం మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎమ్మెల్యేను కలవడానికి రావుట్లకు చెందిన బీఆర్‌ఎస్‌ నాయకులు గత నెల 22న హైదరాబాద్‌కు కారులో వెళ్తుండగా చేగుంట వద్ద వీరిని కోళ్ల వ్యాను ఢీకొన్నది. ఈ ఘటనలో కారులో ఉన్న ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవింగ్‌ చేస్తున్న రాజేందర్‌ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య లత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా



డిచ్‌పల్లి: మండలంలోని నడిపల్లి తండా వద్ద ఆర్మూర్‌ నుంచి కామారెడ్డి వెళ్తున్న కారు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో కారులోని బెలూన్‌ ఓపెన్‌ కావడంతో ఎవరికీ గాయాలు కాలేదు. స్థానికులు బాధితులను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తలరించారు.

బాన్సువాడ బస్టాండ్‌లో చోరీ

బాన్సువాడ: బాన్సువాడ బస్టాండ్‌లో శుక్రవారం రాత్రి ఓ మహిళా ప్రయాణికురాలి బ్యాగులో ఉన్న 5.8 తులాల బంగారాన్ని దుండగులు చోరీకి పాల్పడ్డారు. నిజామాబాద్‌కు చెందిన గోదావరి తన సోదరుడి ఇంట్లో శుభకార్యనిమిత్తం బిచ్కుందకు వెళ్తుండగా బాన్సువాడలో దిగింది. బాన్సువాడలో బిచ్కుంద వెళ్లేందుకు దెగ్లూర్‌ బస్సు ఎక్కగా బ్యాగులో ఉన్న బంగారం చోరీకి గురైనట్లు తెలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

పశువుల కొట్టం దగ్ధం



మాచారెడ్డి: అక్కాపూర్‌ గ్రామంలోని రమేశ్‌కు చెందిన పశువుల కొట్టంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి ఓ గేదె సజీవ దహనం కాగా మరో గేదెకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గేదెతో పాటు వరిగడ్డి దగ్ధం కావడంతో రు 1.30లక్షల వరకు నష్టం వాటిల్లినట్టు బాధితుడు తెలిపాడు.

హౌసింగ్‌ బిల్లుల కోసం ఎంతో శ్రమించా

స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

రుద్రూర్‌: హౌసింగ్‌ బిల్లుల కోసం ఎంతో శ్రమిస్తున్నట్లు స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆరు మండలాల డబుల్‌ బెడ్‌రూం ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లులు శనివారం అందజేశారు. నియోజకవర్గంలో ప్రతి కుటుంబానికి పక్కా ఇళ్లు ఉండాలనే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోనే అధికంగా 11వేల ఇళ్లు బాన్సువాడ నియోజకవర్గానికి సీఎం కేసీఆర్‌ సహకారంతో మంజూరు చేసినట్లు తెలిపారు. బిల్లుల కోసం నిద్రలేని రాత్రులు గడిపామని, చివరకు సీఎం సహకారంతో బిల్లులను మంజూరు చేయించినట్లు చెప్పారు. సొంత స్థలం ఉంటే గృహలక్ష్మి కింద ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. సమావేశానికి పలు గ్రామాల లబ్ధిదారులు రాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధుల తీరుపై స్పీకర్‌ అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు సుజాత, శ్రీలక్ష్మి, జడ్పీటీసీలు సరోజి గంగారాం, శంకర్‌ పటేల్‌, హౌసింగ్‌ డీఈ నాగేశ్వర్‌రావు, తహసీల్దార్‌ వెంకటేశ్‌, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

క్రీడా కమిటీ ఎన్నికల షెడ్యూల్‌ విడుదల

నిజామాబాద్‌నాగారం: విద్యుత్‌శాఖలో స్పోర్ట్స్‌ కౌన్సిల్‌ నూతన కమిటీకి సంబంధించి ఎన్నికల షెడ్యూల్‌ విడుదలైంది. ఎన్నికల అధికారిగా కన్‌స్ట్రక్షన్‌ డీఈ వెంకటరమణ వ్యవహరిస్తున్నారు. ఈ నెల 8న నూతన కమిటీకి ఎన్నికల ప్రక్రియ నిర్వహించనున్నారు. ఇప్పటికే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాకు సంబంధించి సభ్యత్వాలు చేపట్టారు. ఇప్పటికే నిజామాబాద్‌లో 220, కామారెడ్డిలో 181 మంది సభ్యత్వం తీసుకున్నారు. నూతన కమిటీకి ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏళ్ల తరబడి ఏకగ్రీవంగా స్పోర్ట్స్‌ కమిటీ

కొన్నేండ్లుగా స్పోర్ట్స్‌ కౌన్సిల్‌ కమిటీ ఏకగ్రీవంగా కొనసాగుతూ వస్తోంది. మొదటిసారిగా కమిటీ సభ్యులు తాము పదవిలో ఉండమని తప్పుకున్నారు. దీంతో నూతన కమిటీకి ఎన్నికలు నిర్వహించనున్నారు. కమిటీ ఏళ్ల తరబడిగా ఏకగ్రీవంగా కొనసాగడంతో ఎలాంటి సభ్యత్వాలు స్వీకరించలేదు. ఈ నెల 8న స్పోర్ట్స్‌ కౌన్సిల్‌ అధ్యక్షుడు ఎస్‌ఈ రవీందర్‌ ఆధ్వర్యంలో అడహక్‌ కమిటీ ఏర్పాటు కానుంది. పాత సభ్యత్వాలు లేనందునే అడహక్‌ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్నికల అధికారి వెంకటరమణ తెలిపారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక



వేల్పూర్‌ శ్రీనివాస్‌

బాల్కొండ: బాల్కొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయుడు వేల్పూర్‌ శ్రీనివాస్‌ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ప్రభుత్వం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసింది. శ్రీనివాస్‌ ఆలూర్‌ మండల కేంద్రానికి చెందిన హన్మండ్లు, వెంకుబాయిల మూడో సంతానం. ప్రాథమిక విద్యాభ్యాసం ఆలూర్‌లో చేశారు. ఇంటర్మీడియట్‌ జిల్లా కేంద్రంలోని ఖిల్లా కాలేజీలో, డిగ్రీ ఆర్మూర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో మాస్టర్‌ డిగ్రీ పూర్తి చేశారు.

గుండారం పాఠశాల ఉపాధ్యాయుడు నరేశ్‌రావు



కాసర్ల నరేశ్‌రావు

నిజామాబాద్‌ రూరల్‌: మండలంలోని గుండారం ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు కాసర్ల నరేశ్‌రావు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైనట్లు డీఈవో దుర్గాప్రసాద్‌ శనివారం తెలిపారు. నరేశ్‌రావు ఈ నెల 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌ ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు తీసుకోనున్నారు.

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచాలి



మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకుడు సంజీవ్‌

బోధన్‌: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచాలని ఉన్నత శిక్షణ కార్యక్రమం రాష్ట్ర పరిశీలకుడు సంజీవ్‌ అన్నారు. పట్టణ కేంద్రంలోని ఇందూర్‌ బీఈడీ కళాశాలలో డివిజన్‌లోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఉన్నత శిక్షణ తరగతులు నిర్వహించారు. శిబిరాన్ని ఆయన సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఎంఈవో నాగనాథ్‌, కోర్స్‌ మండల కో–ఆర్డినేటర్‌ సూర్యకుమార్‌, సీఆర్పీలు ఉన్నారు.

అవినీతి బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలను ఓడించాలి



బోధన్‌: వచ్చే ఎన్నికల్లో అవినీతి బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలను ప్రజలు ఓడించాలని కాంగ్రెస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌ రెడ్డి కోరారు. పట్టణ కేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌ ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ చూసి బీఆర్‌ఎస్‌, బీజేపీ పార్టీల్లో వణుకు మొదలైందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంతిరెడ్డి రాజిరెడ్డి, పట్టణ, మండలాల అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, పులి శ్రీనివాస్‌, హరికాంత్‌చారి, గణపతిరెడ్డి, అల్లె రమేశ్‌, రవీందర్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్‌, సంజీవ్‌రెడ్డి, కలీం, నవీన్‌ పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ



పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ పట్టణానికి చెందిన నటరాజ నృత్యనికేతన్‌ విద్యార్థులు నవ్య నాటక సమితి హైదరాబాద్‌ వారు నిర్వహించిన 48వ ఆలిండియా మ్యూజిక్‌, డ్యాన్స్‌ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన మ్యూజిక్‌, డ్యాన్స్‌ విభాగాల్లో దేవాన్షి తృతీయ, తన్వీ కన్సోలేషన్‌ బహుమతి గెలుపొందారు. దీంతో నాట్య గురువులు మృణిలిణి, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ఫార్మా కంపెనీ ఎదుట ఆత్మహత్యాయత్నం

- బిల్లులు ఇవ్వడం లేదంటు వార్డు సభ్యుడి ఆవేదన



ఒంటిపై పెట్రోల్‌ పోసుకుంటున్న జ్యోతి



కత్తితో మెడ కోసుకునేందుకు యత్నిస్తున్న శివరాజు

భిక్కనూరు: బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న ఓ ఫార్మ కంపెనీ ఎదుట వార్డు సభ్యుడు తన భార్యతో కలిసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని జంగంపల్లిలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. జంగంపల్లికి చెందిన బీఆర్‌ఎస్‌ నాయకుడు, వార్డు సభ్యుడు చెట్కూరి శివరాజు గ్రామ శివారులోని ఓ ఫార్మ కంపెనీతో ఒప్పంద ప్రకారం 2022లో మూడు బస్సులను అద్దెకు ఇచ్చాడు. కానీ యాజమాన్యం బిల్లుల చెల్లింపులో జాప్యం చేస్తూ వస్తోంది. దీంతో ఫైనాన్స్‌ వారు ఇటీవల సరిగా ఈఎంఐలు చెల్లించడం లేదంటూ బస్సులను సీజ్‌ చేశారు. బిల్లులను చెల్లించాలంటూ శివరాజు, భార్య జ్యోతితో కలిసి ఫార్మ కంపెనీ ఎదుట ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసుల ఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు ఇరువురితో చర్చిస్తుండగానే శివరాజు కొడవలితో, జ్యోతి పెట్రోల్‌ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన పోలీసులు, సిబ్బంది వారిని అడ్డుకున్నారు.

భార్య, కుమారులే హంతకులు

- పొలం దక్కకుండా చేస్తాడనే కోపంతో ఘాతుకం
- హత్య కేసును ఛేదించిన పోలీసులు



మాట్లాడుతున్న సీఐ జయేశ్‌రెడ్డి

రుద్రూర్‌: కోటగిరి మండలం ఎత్తొండ బ్రిడ్జి వద్ద అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఉమ్మల ఆజయ్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఈ కేసులో భార్య, ఇద్దరు కుమారులే అసలైన నిందితులను వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ జయేశ్‌రెడ్డి శనివారం తెలిపారు. కోటగిరి పీఎస్‌లో నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. ఆజయ్య దురలవాట్లకు బానిసై ఉన్న పది గుంటల పొలాన్ని తమకు దక్కకుండా చేస్తున్నాడనే కోపంతో బ్రిడ్జి వద్ద హత్య చేసినట్లు తెలిపారు. కోటగిరి ఎస్సై సందీప్‌, ఏఎస్సై బాల్‌సింగ్‌, సిబ్బంది ఉన్నారు.